ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11.06.2024 సమయం: 13:10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని జ్యుడీషియల్ కమిషన్ ఈ రోజ రెండో రోజు విద్యుత్ కొనుగోళ్లపై విచారణ కొనసాగిస్తోంది. ఈ విచారణలో భాగంగా 18 మంది అధికారులకు నోటీసులు ఇచ్చింది.

2. ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమి శాసనసభా పక్షనేతగా , టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ఈ రోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కూటమి నేతలు కోరారు.

3. రామగుండం NTPC కార్మాగారంలో ఫ్లైయాష్ తరలింపులో అవకతవకలు జరిగాయని , అందులో రాష్ట్ర మంత్రి ఒకరికి ప్రమేయం ఉందని BRS పార్టీ ఈ రోజు ఆరోపించింది

4. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించడంతో నేటి నుంచి మూడు రోజుల పాటు పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

**కాళేశ్వరం-విచారణ**: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని జ్యుడీషియల్ కమిషన్ రెండో రోజు విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ విచారణ కొనసాగిస్తోంది. ఈ విచారణలో 18 మంది అధికారులకు నోటీసులు ఇచ్చింది. ఈ కమిషన్ ఛత్తీస్ గఢ్ ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియపై విచారణ చేపట్టింది. కాగా, నిన్న కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన జస్టిస్ ఘోష్ ప్రాజెక్టుపై

వివరాలు తగిన సమయంలో వెల్లడిస్తామని, విచారణతో సంబంధం ఉన్న అధికారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. పరిహారం కోసం క్లెయిమ్‌లతో సహా 54 ఫిర్యాదులు కమిషన్‌కు అందాయని కూడా ఆయన చెప్పారు. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, విచారణ కోసం వివిధ ఏజెన్సీలను పిలిపిస్తున్నామని, నిజానిజాలను వెలికితీసేందుకు సంబంధిత సమాచారాన్ని సేకరిస్తున్నామని జస్టిస్ ఘోష్ చెప్పారు. విచారణ వేగంగా సాగుతున్నప్పటికీ మరింత సమయం పడుతుందని జస్టిస్ ఘోస్ పేర్కొన్నారు. **(MSL)**

**ఏపీ- చంద్రబాబు** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎన్ చంద్రబాబు నాయుడు రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ రోజు విజయవాడలో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శాసన సభా పక్ష సమావేశంలో చంద్రబాబును ఎన్డీఏ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. చంద్రబాబు పేరును జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రతిపాదించగా.. మూడు పార్టీల ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ ఏకగ్రీవ తీర్మానాన్ని కూటమి నేతలు గవర్నర్ అబ్దుల్ నజీర్ కు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. కాగా , రేపు ఉదయం 11 గంటల 27 నిమిషాలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కృష్ణా జిల్లా గన్నవరంలో కేసరపల్లి IT పార్క్ లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నేతలు , పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. కాగా, జనసేన శాసనసభా పక్షనేతగా పవన్ కల్యాణ్ ను ఆ పార్టీ ఏకగ్రీవంగా ఎ న్నుకుంది. ఈ ఉదయం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జనసేన శాసనసభా పక్షనేతగా పవన్‌కల్యాణ్ పేరును ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. దీనికి మిగిలిన ఎమ్మెల్యేలం తా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. **(DESK)**

**BRS-Allegations:** రామగుండం NTPC కార్మాగారంలో ఫ్లైయాష్ తరలింపులో అవకతవకలు జరిగాయని , అందులో రాష్ట్ర మంత్రి ఒకరికి ప్రమేయం ఉందని BRS పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి , కె.పి .వివేకానంద , డాక్టర్ కె . సంజయ్ ఆరోపించారు. హైదరాబాద్ లో ఈ రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఒక ట్రక్కులో 32 టన్నులు ఫ్లైయాష్ కు బదులు 72 టన్నులు తరలించి , వేబిల్లుల్లో బరువు పేర్కొనటం లేదన్నారు. దీనివల్ల రోజుకు 50 లక్షల రూపాయలు దారి మ ళ్లుతున్నాయని వారు ఆరోపించారు. ఇందులో ఒక మంత్రి కుటుంబ సభ్యులకు నేరుగా ప్రమేయం ఉందన్నారు. ఇలాంటి అక్రమ లోడుతో వెళుతున్న 13 లారీలను తాము స్వయంగా గుర్తించగా , వాటిలో రెండింటిని రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరించారు. అక్రమ ఫ్లైయాష్ లోడు వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని , వెంటనే అక్రమ ఫ్లై యాష్ లోడు వ్యవహారాన్ని నిలిపివేయాలనీ BRS శాసనసభ్యులు డిమాండు చేశారు. **(MSL)**

**సీతక్క-సమీక్ష :** భారీ వర్షాలు, వరదల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి నిన్న సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాకాలం సమీపించినందున వరదల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, సిజినల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాతే ప్రజలకు త్రాగు నీటిని సరఫరా చేయాలని , పురాతన ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు.**(PTC)**

**వరంగల్ స్మార్ట్ సిటీ టెండర్లు** : గ్రేటర్ వరంగల్ కు చెందిన పలు స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేసినట్లు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఇందుకు సంబంధించి సీడీఎంఏ , ఈ ఎన్ సీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిన్న సమావేశం జరిగిందని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన టెంటర్ల ప్రక్రియను తిరిగి ప్రారంభించమన్నారు. నగరంలో 120 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న 21 అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేసినట్లు కమిషనర్ తెలిపారు.**(PTC)**

**జగిత్యాల జిల్లా-మున్సిపల్ కమిషనర్ :** నకిలీ పత్రాలు సృష్టించి భూకబ్జాకు యత్నించిన వ్యవహారంలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్ సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఉద్యోగి సహా ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు జగిత్యాల పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు. జగిత్యాల పట్టణ సమీపంలోని హస్నాబాద్ శివారు సర్వేనెం 1598లో 12 గుంటల భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితురాలు కీర్తి విజయ లక్ష్మి ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఈ కేసులో కేసులో మునిసిపల్ రెవెన్యూ అధికారి బడుగు ప్రసాద్ , ఖాజా అమీరుద్దీన్, ఎండీ ముజాకీర్ అలీ అరెస్ట్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామన్నారు. జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్ , ఇమ్రాన్ ఇద్దరు పరారీలో ఉన్నట్లు వివరించారు. **(PTC)**

**త్రిపుర గవర్నర్ -నాగర్ కర్నూల్ :** త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి ఈరోజు నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని బిజినేపల్లి మండలం వట్టెం వేంకటేశ్వర స్వామి దేవస్థానం సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. **(PTC)**

**సంగారెడ్డి-కలెక్టర్ :** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలు బలోపేతం కావాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సంగారెడ్డి జిల్లాలోని ఇస్మాయిల్ ఖాన్ పెట , చింతలపల్లి , హాస్టల్ గడ్డ ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. కొత్తగా ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫామ్ అందజేశారు. విద్యార్థులు , ఉపాధ్యాయుల హాజరు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం , పాఠశాల మరమ్మతులు సమర్థవంతంగా చేపపడితే పాఠశాలలను బలోపేతం చేయవచ్చని కలెక్టర్ అన్నారు. **(PTC)**

**నాగర్ కర్నూల్ జిల్లా-పాఠశాల :** నాగర్ కర్నూల్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు రేపు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామ్ లాల్ ఒక ప్రకటనలు తెలిపారు. ఆయా పాఠశాలలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు సకాలంలో లక్కీ డ్రాకు హాజరుకావాలని కోరారు. ఒకటో తరగతిలో 90 సీట్లు, ఐదో తరగతిలో 88 సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. **(PTC)**

**కరీంనగర్ ధాన్యం కొనుగోళ్లు :** కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు అధికారికంగా ముగిసాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 321 కొనుగోలు కేంద్రాల ద్వారా 49 వేల 84 మంది రైతుల నుంచి 589.05 కోట్ల రూపాయల విలువైన 2 లక్షల 67 వేల 421.180 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసారు. ఇప్పటికే వీరందరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. **(PTC)**

**వాతావరణం :** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మరింతగా విస్తరించాయి. ఈ కారణంగా రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రం వ్యాప్తంగా విస్తారంగా వర్షం కురిసే అవకాశం ఉందని

హైదరాబాద్ వాతావరణ కేంద్రం   తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీచేశారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీటమునిగే అవకాశం ఉన్నదని వాతావారణ శాఖ తెలిపింది. మరోవైపు వర్షాకాలంలో వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తా సూచించారు. **(DESK)**